www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 29 ఆగస్టు 2023
1

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బన్న ఆశాలు మృతి

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్, మాజీ మంచిర్యాల మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మెన్ బన్న ఆశాలు(86) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అయన వెంట జడ్‌పిటిసి పల్లె చంద్రయ్య, ఎంపిటిసి రాంచందర్, ఉపసర్పంచ్ పిట్టల సుమన్, వాసుదేవ్ ఉన్నారు.



జిల్లా అటవీ శాఖ అధికారిగా ప్రశాంత్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా అటవీశాఖ అధికారిగా ప్రశాంత్ పాటిల్ బాజీరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాహుల్ రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందజేసి పరిచయం చేసుకున్నారు.



ఇక విద్యుత్ ఛార్జింగ్ కేంద్రాలు..!

- ఉమ్మడి జిల్లాలో 70 ఏర్పాటుకు చర్యలు
- ఇప్పటికే స్థలాలను గుర్తించిన రెడ్కో అధికారులు
- పీపీపీ పద్ధతిలో అప్పగించేందుకు నిర్ణయం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో త్వరలోనే విద్యుత్ ఛార్జింగ్ కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం పెరుగుతున్న దృష్ట్యా ఈ ఛార్జింగ్ పాయింట్ల ఏర్పాటు ఆవశ్యకత ఏర్పడింది. దీంతో ప్రభుత్వం ఈ ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ఈ బాధ్యతను తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(టీఎస్ రెడ్కో)కు అప్పగించింది. ఈ శాఖ అధికారులు ఇప్పటికే జిల్లాల వారీగా స్థలాలను గుర్తించి సిద్ధంగా ఉంచారు. ఈ కేంద్రాలను ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం(పీపీపీ) పద్ధతిలో నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. తాజాగా అధికారులు నిర్ణయించిన స్థలాల్లో సొంత ఖర్చుతో ఏర్పాటుచేసుకొని వాటిని పదేండ్ల పాటు నిర్వహించేందుకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులను కోరుతున్నారు. వచ్చే నెల 4వ తేదీ రోజు హైదరాబాదులోని ఆ శాఖ ప్రధాన కార్యాలయంలో ప్రత్యక్షంగా అందజేసి కేటాయింపు ప్రక్రియలో పాల్గొనాలని సూచిస్తున్నారు. సొంత ఖర్చుతో స్టేషన్లు ఏర్పాటుచేసుకోవాల్సి ఉంటుంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

వాహనాల పొగ కారణంగా కాలుష్యం పెరిగిపోతోంది. ఫలితంగా అనేక వాతావరణ మార్పులకు కారణభూతంగా మారుతోంది. ప్రస్తుతం ద్విచక్రవాహనాల నుంచి మొదలుకొని పెద్ద వాహనాల వరకు సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ఈ పదేండ్ల కాలంలో వాహనాల వినియోగం సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రతి ఒక్కరి ఇంట్లో కనీసం ద్విచక్ర వాహనం తప్పనిసరి కనిపిస్తోంది. వాహనాల వినియోగంతో పాటు వాటి ద్వారా వెలువడే పొగ కూడా విపరీతంగా పెరుగుతోంది. వీటికి అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను తెరమీదకు తీసుకొచ్చింది. ఇప్పటికే ఈ రెండేండ్ల కాలంలో ఈ వాహనాల సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. కేవలం విద్యుత్ ఛార్జింగ్‌తో నడిచే ఈ వాహనాలు తక్కువ దూరానికే పరిమితవుతున్నాయి. ప్రస్తుతం ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు కలిగిన ఇంట్లోనే ఛార్జింగ్ పెట్టి వారి వాహనాలను నడిపిస్తున్నారు. కానీ కార్లు కలిగిన వారు మాత్రం వాహనంతో దూర ప్రాంతాలకు వెళ్లాలంటే వెనుకడుగు వేస్తున్నారు. అయా వాహనాల సామర్థ్యాన్ని బట్టి సుమారు 20యూనిట్ల ఛార్జింగ్ పెడితే కనీసం 700కి.మి వరకు ప్రయాణం చేసేందుకు వీలుంటుందని తెలుస్తోంది. కానీ వాహనాలను తీసుకెళ్తున్న వారికి తిరుగు ప్రయాణంలో ఛార్జింగ్ పాయింట్ లేకపోతే తిరిగి ఇంటికి చేరడం కష్టంగా మారుతోంది. ఇలాంటి వారి సమస్యలను దూరం చేసేందుకు ప్రభుత్వం ఈ విద్యుత్ ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటుచేయాలని సంకల్పించింది.



పీపీపీ పద్ధతిలో నిర్వహణ..!

ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో అనేక మంది ఈ ఎలక్ట్రిక్ వాహనాల వాడకం వైపు దృష్టిసారించారు. తక్కువ ఖర్చుతో ప్రయోజనం పొందే వీలుండటంతో వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే పట్టణ ప్రాంతాల్లో చాలా వరకు ద్విచక్ర వాహనాలు వినియోగిస్తున్నారు. రానున్న పదేండ్ల కాలంలో వీటితో పాటు కార్లు, ఇతర వాహనాల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ముందస్తుగానే ఈ విద్యుత్ ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటుచేస్తే బాగుంటుందనే ఆలోచనతో ఈ ప్రాజెక్టుకు అంకురార్పణ చేస్తోంది. కాలుష్యం, చమురు వినియోగాన్ని తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వాహనాల వినియోగంపై దృష్టిసారిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఆర్టీసీ సంస్థలోనూ ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టే అవకాశం కనిపిస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 70 కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 19, నిర్మల్‌లో 16, మంచిర్యాలలో 26, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 09 కేంద్రాలను ఏర్పాటుచేసేందుకు ఔత్సాహికులను దరఖాస్తులు తీసుకుంటున్నారు. ప్రస్తుతం రోడ్డుపక్కనే గుర్తించిన ఈ స్థలాలను ఎంపికైన ఆపరేటర్లకు పదేండ్ల పాటు రెవెన్యూ షేరింగ్ ఆధారితంగా కేటాయించనున్నారు.

స్థలాల గుర్తింపు పూర్తయింది : నివర్తి, మేనేజర్, రెడ్కో, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా

ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య పెరుగుతోంది. వీటి అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం విద్యుత్ ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటుచేస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఈ కేంద్రాలను ఏర్పాటుచేసేందుకు అవసరమైన స్థలాలను గుర్తించాం. వీటిని పీపీపీ పద్ధతిలో అప్పగించేందుకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు కోరుతున్నాం. సెప్టెంబర్ 4న ఖైరతాబాద్‌లో ఉండే రెడ్కో ప్రధాన కార్యాలయంలో స్టేషన్ల కేటాయింపు ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గొనాల్సి ఉంటుంది.



సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో విద్యుత్ అమరవీరుల దినోత్సవం



నిర్మల్: సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం ప్రజాసంఘాల కార్యాలయంలో విద్యుత్ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. అమరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్ మాట్లాడారు. 2000 సంవత్సరంలో పెంచిన కరెంటు చార్జీలను తగ్గించాలని జరిగిన చలో అసెంబ్లీ కార్యక్రమంలో పోలీసు తూటాలకు ముగ్గురు నాయకులు అమరులయ్యారన్నారు. విష్ణువర్ధన్, బాలస్వామి, రామకృష్ణ పోలీసుల తూటాలకు బలయ్యారని తెలిపారు. వామపక్షాల అమరత్వం విద్యుత్ చార్జీలను ఇష్టారీతిన పెంచకుండా ఉండడానికి తోడ్పడిందన్నారు. పేదలపై భారాలు వేయడానికి ప్రభుత్వాలు భయపడుతున్న పరిస్థితి వచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మెన సురేష్, డి.పోశెట్టి, అరవింద్, నవీన్ పాల్గొన్నారు.

అర్హులైన అభ్యర్థులకు పరిశ్రమలు, యూనిట్ల మంజూరు



ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో టిఎస్- ఐపాస్, టి- ప్రైడ్ కింద అర్హులైన అభ్యర్థులకు పరిశ్రమలు, యూనిట్ల స్థాపనకు మంజూరు జారీ చేయడం జరుగుతుందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో పరిశ్రమల ప్రమోషన్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఈ సంవత్సరం జులై మాసంలో టిఎస్- ఐపాస్ కింద ఒక పరిశ్రమకు దరఖాస్తు రాగా, జిల్లా కమిటీ అనుమతి మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. టి- ప్రైడ్ కింద షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అభ్యర్థులు రవాణా సెక్టర్ కింద ఒక దరఖాస్తు రాగా, రూ.2.63లక్షలు సబ్సిడీ కింద మంజూరు చేశామని తెలిపారు.

బాల్య వివాహాలు అరికట్టేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు

అనంతరం సఖీ కేంద్రం నిర్వహణపై అధికారులతో కలెక్టర్ సమీక్షిస్తూ బాల్య వివాహాలను అరికట్టేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. జిల్లాలో పదవతరగతి పాస్ అయిన బాలికలు ఇంటర్‌లో ప్రవేశం పొందాలని, ఫెయిల్ అయిన బాలికలకు ప్రత్యేక వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రలలో చేరేలా చేయాలని సూచించారు. ఆధార్ కేంద్రాలలో వయసు మార్పిడికి సరైన ధ్రువపత్రాలను పరిశీలించిన తర్వాతే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, లేని పక్షంలో ఆధార్ కేంద్రాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్త, శ్యామలదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహ, డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, ఆర్డీఓ స్రవంతి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడి శంకర్, జిల్లా సంక్షేమ అధికారిణి మిల్కా, సఖి కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాలీలకు ఎస్టీ హోదా బిజెపితోనే సాధ్యం



కాగజ్‌నగర్ రూరల్ : మాలీలకు ఎస్టీ హోదా బిజెపితోనే సాధ్యమని మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు అన్నారు. ఖమ్మంలో రైతు గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. శ్యాంరావు మాట్లాడుతూ 2014 నుండి బీఆర్ఎస్‌లో ఉన్నానని, తెలంగాణ ఉద్యమ సమయంలో పార్టీ మండల అధ్యక్షునిగా, రాష్ట్ర సాధన కొరకు అన్ని ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నానని తెలిపారు. కేసీఆర్ చేసిన వాగ్దానాలన్నీ మరిచిపోయి రాష్ట్రాన్ని దోచుకుని తన కుటుంబాన్ని బాగు చేసుకున్నాడని, మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని తన స్వార్థం కోసం అప్పుల రాష్ట్రంగా మార్చాడని పేర్కొన్నారు. ఆంధ్ర నాయకుడు కోనేరు కోనప్పను కేసీఆర్ పార్టీలో చేర్చుకుని అతనికి పార్టీ టికెట్ ఇస్తూ సిర్పూర్ నియోజకవర్గంలో విచ్చలవిడిగా దోపిడీకి సహకరిస్తున్నాడన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలోని ప్రజలందరినీ తనకు బానిసలుగా చేసుకొని విచ్చలవిడిగా దోచుకుంటున్నాడని తెలిపారు. పార్టీలో చేరినవారిలో మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అదే నాందేవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గౌత్రే గోపాల్ ఉన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

నస్పూర్ : శ్రీరాంపూర్ ఏరియా ఉపరితల గని సిఆర్ఆర్ కంపెనీలో బ్లాస్టింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికుడు కొన్ని నెలల క్రితం ప్రమాదంలో గాయపడి ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సిఆర్ఆర్‌టీబీ కాంట్రాక్టు కంపెనీలో పనిచేస్తున్న అట్కపురం రాజయ్య మే నెలలో ఉద్యోగం చేసి ఇంటికి వెళ్తున్న సమయంలో చెక్ పోస్ట్ గేటు తలకు తగలడంతో ప్రమాదం జరిగింది. అప్పటినుండి హాస్పటల్‌లో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రిలో మృతి చెందాడు. సిఆర్ఆర్ కంపెనీ బాధ్యత వహిస్తూ రూ.30లక్షల ఎక్స్‌గ్రేషియా, కుమారునికి ఉద్యోగం, కంపెనీ ఉన్నంతవరకు భార్యకు అతని జీతం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిఆర్ఆర్ కంపెనీ ఎదుట ధర్నా నిర్వహించారు. సింగరేణి అధికారులు, సిఆర్ఆర్ కంపెనీ యజమానులు స్పందించాలని డిమాండ్ చేశారు.



కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న ప్రభుత్వాలు

- సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు అన్నారు. సీఐటీయూ ప్రథమ మహాసభలను సోమవారం పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో నిర్వహించారు. సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రెటరీ కూశన రాజన్న జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వంగూరు రాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బరితెగించి కార్పొరేట్‌కు అనుకూలంగా, కార్మికులకు వ్యతిరేకంగా పరిపాలన సాగిస్తోందన్నారు. రైతాంగ వ్యతిరేక చట్టాలను నిరంకుశంగా ఆమోదించుకున్నప్పటికీ కార్మిక, కర్షక ఉద్యమంతో ఆ చట్టాలను ఉపసంహరించుకున్నదని గుర్తు చేశారు. 2015లో నరేంద్ర మోడీ పార్లమెంట్‌లో ఇచ్చిన కనీస మద్దతు ధర హామీ నేటికీ అమలు కాలేదన్నారు. 2023-24 కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి, ఆహార ఉత్పత్తులకు సబ్సిడీలకు భారీగా కోతలు విధించిందన్నారు. ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాలపై ఉక్కుపాదం మోపిందన్నారు. ఉపాధి, నిరుద్యోగం, అధిక ధరలు, ఆకలి, అసమానతలు, ఆరోగ్య రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలను జటిలం చేసున్నదని తెలిపారు. జాతీయ రహదారులు, రైళ్లు, విద్యుత్ స్టేషన్లు, ట్రాన్స్ మిషన్, చమురు-సహజ వాయివు, బొగ్గు గనులు, టెలికం టవర్లు, విమానాశ్రయాలు, ఓడరేవులు, ఎఫ్‌సిఐ గోడౌన్లు, క్రీడా మైదానాలతో సహా ప్రజా ఆస్తులను కార్పొరేట్లకు తెగనమ్ముతోందని మండిపడ్డారు. ఉద్యోగుల కష్టార్జితమైన పిఎఫ్, పెన్షన్ నిధులను ప్రైవేట్ ఇన్సూరెన్స్, మ్యూచువల్ ఫండ్ సంస్థలకు అప్పజెప్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు ఓదెలు, ఆనంద్ కుమార్, లోకేష్, రాజేందర్, ఆర్.త్రివేణి, సంజీవ్, మోరేశ్వర్ పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



కాంట్రాక్టు ఏఎన్ఎంల పట్ల ప్రభుత్వ విధానం మారాలి

నవతెలంగాణ-నస్పూర్

కాంట్రాక్టు ఏఎన్ఎంల పట్ల ప్రభుత్వం విధానం మారాలని, ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను 20ఏళ్లుగా వెట్టి చాకిరి చేయించుకుంటుందని, కనీస వేతనం ఇవ్వకుండా అన్యాయం చేస్తుందని తెలిపారు. కరోనా సమయంలో ప్రజల ప్రాణాలను నిలబెట్టి వారికి వైద్యం అందిస్తే ఈ ప్రపంచమే వైద్య శాఖను గుర్తించినా తెలంగాణ ప్రభుత్వం మాత్రం వీరి సేవలను మర్చిపోయిందని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని, కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు బి.పద్మ కార్యదర్శి మంజుల, కవిత ప్రవీణ, స్రవంతి, శైలజ, రాధ, రాజకుమారి, విజయలక్ష్మి, దివ్య, మీనా, సంధ్య శంకరమ్మ, స్వప్న పాల్గొన్నారు.



మందమర్రిలో మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

మందమర్రి : ఆశా వర్కర్లు చేస్తున్న ఆందోళనకు పీసీసీ సభ్యులు నూకల రమేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నోముల ఉపేందర్‌గౌడ్, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి ఎండి ముజాహిద్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారం రోజులుగా ఆశా వర్కర్లు నిరసన చేస్తున్నా పట్టించుకునేనాథుడే కరువయ్యాడని, వెంటనే డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పుల్లూరి లక్ష్మణ్, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎండి జమీల్, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గడ్డం రజిని, ఆశా వర్కర్లు సబిత, కవిత, రూప, పద్మ, శ్యామల, రాధ పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పంటల పరిశీలన

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పన క్షేత్రస్థాయిలో రైతులు వేసిన పంటలను పరిశీలించారు. వానాకాలం పంటల సాగులో రైతులు తీసుకోవాల్సిన చర్యలపైన వివరించారు. పంటల సస్యరక్షణ చర్యలు, దఫదఫాలుగా పీఎస్బీ వాడకంపై అవగాహన కల్పించారు. ముత్యంపల్లిలో ఫెర్టిలైజల్ దుకాణాన్ని తనిఖీ చేసి, ఎరువులను అధిక ధరలకు అమ్మకూడదని, రైతులకు తప్పనిసరిగా బిల్ ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దేవులపల్లి వందన, వ్యవసాయ విస్తరణ అధికారి రమ్య పాల్గొన్నారు.



పెద్ద మొత్తంలో దేశీదారు స్వాధీనం

- ఇద్దరు అదుపులోకి, ఒకరు పరారీ



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

పట్టణంలోని ఎన్జీఓస్ కాలనీలో సోమవారం పెద్దమొత్తంలో దేశీదారు స్వాధీనం చేసినట్టు టాస్క్ ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. సాయంత్రం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఎన్జీఓస్ కాలనీలో దేశీదారు దిగుమతి చేస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో స్కార్పియొ(ఎంహెచ్ 16 ఏటీ 0939) వాహనంలో ఉన్న 30 కార్టూన్ల (3000 సీసాలు రూ. 2 లక్షల విలువ గల) దేశీదారు, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా మహారాష్ట్రకు చెందిన సచిన్‌రాజ్ అడ్లకొండవార్, సుగత్ సంజయ్ రాయపూర ఇద్దరు కలిసి కాగజ్‌నగర్‌లోని తిరందాజ్ బస్తీకి చెందిన జాడి శ్రీకాంత్‌కు దేశీదారు అప్పగించే క్రమంలో ఎన్జీఓస్ కలనీలో పట్టుకున్నారు. జాడి శ్రీకాంత్ కొంత కాలంగా పట్టణ కేంద్రంగా మహారాష్ట్ర నుండి తక్కువ ధరకు అక్రమంగా దేశీదారును దిగుమతి చేసుకుని కాగజ్‌నగర్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాలకు అమ్ముతున్నాడు. శ్రీకాంత్ పరారీలో ఉన్నాడు. వీరి వద్ద నుండి దేశీదారు, వాహనం స్వాధీనం చేసుకుని కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్లో అప్పగించి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. సీఐ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు లోను కావద్దని, దేశీదారు, గుడుంబా, గంజాయి వంటి మత్తుపదార్థాలు అమ్మినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, ఎస్సై సందీప్‌కుమార్, పీసీలు మధు, రమేష్, సంజీవ్ పాల్గొన్నారు.

ఎస్సీ డిక్లరేషన్‌పై హర్షం



నవతెలంగాణ - రెబ్బెన

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దళితులకు, గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసే 12 అంశాల డిక్లరేషన్ ప్రకటించిన సందర్భంగా సోమవారం గోలేటిలో దళిత కాంగ్రెస్ జిల్లా చైర్మన్ పోశం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత, గిరిజనులకు అవమానాలు తప్ప ఆశించిన ప్రగతి కనిపించడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దళిత, గిరిజనుల సంక్షేమానికి పాటుపడుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ గురించి ప్రతి ఇంటికి, వాడవాడకు వెళ్లి ప్రచారం చేయాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లావుడ్య రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, లావుడె పల్లాస్, జిల్లెల స్వామి, లింగంపెల్లి ప్రభాకర్, సీనియర్ నాయకులు రాయమల్లు, సంతోష్, గోపాల్, పెంటు, కార్తీక్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనలో సింగరేణి సంస్థ ముందు



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు ఉద్యోగుల మౌలిక సదుపాయాలను కల్పించడంలో ముందు ఉంటుందని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి అన్నారు. కృష్ణ కాలనీలో ఆధునీకరించిన కమ్యూనిటీ హాల్‌ను శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి, సివిల్ జనరల్ మేనేజర్ సూర్యనారాయణతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా కమ్యూనిటీ హాల్స్, హాస్పిటల్స్‌ను ఆధునీకరిస్తామని తెలిపారు. కృష్ణ కాలనీ కమ్యూనిటీ హాల్‌ను సుమారు రూ.20లక్షలతో నిర్మించామన్నారు. కమ్యూనిటీ హాల్‌లో అన్ని వసతులను ఏర్పాటు చేయడం జరిగిందని, వివాహాది శుభకార్యాలకు ఉద్యోగులకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. అలాగే నస్పూర్ కాలనీలో మరొక మినరల్ వాటర్ ప్లాంట్‌ను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ ఏజీఎం సివిల్ నవీన్, డీజీఎం సివిల్ శివరావు, ఆనంద్‌కుమార్, ఎస్ఈ సివిల్ రాము, ఇంజనీర్ సివిల్ గుండేరావు పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ

కాగజ్‌నగర్ రూరల్ : ఆరెగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి పార్శి అశోక్ ప్రారంభించారు. మధుసూదన సాయి జన్మదిన సందర్భంగా విద్యార్థులకు పల్లి పట్టి, మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ మాట్లాడుతూ గత సంవత్సరం నుంచి శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేపడుతున్నామని తెలిపారు. ఈ సంవత్సరం నుండి విద్యార్థులకు అల్పాహారం కింద ఉదయం పూట రోజు విడిచి రోజు కిచిడి కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. విద్యార్థులు విద్యార్థి దశ నుండి కష్టపడి క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి సేవ సమితి ట్రస్ట్ సభ్యులు బట్టు మల్లేశం, వీరేందర్ సింగ్, మండల విద్యాశాఖ అధికారి గడ్డం భిక్షపతి, ప్రధానోపాధ్యాయులు ఏటుకూరి శ్రీనివాసరావు, గొల్లపల్లి రవిశంకర్, మానస, ఉపాధ్యాయులు స్రవంతి, రమేష్, శారద, కవిత, రవి, హాస్మీ అలీ పాల్గొన్నారు.



అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్

మంగళవారం 29 ఆగస్టు 2023

బీటీ రోడ్డు మంజూరు చేయాలి

నవతెలంగాణ-బోథ్

మండలంలోని పార్డి(బి) గ్రామపంచాయతీ పరిదిలోని పరుపుల పల్లె గ్రామానికి బీటీ రోడ్డు, బ్రిడ్జి



మంజూరు చేయాలని పార్డి(బి) సర్పంచ్ జగ్నాక్ మారుతి సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో పీఓ చాహత్ బాజ్‌పాయ్‌కి వినతిపత్రం అందజేశారు. మారుమూల గ్రామమైన గిరిజన ఆదివాసీ గ్రామానికి ఎన్నో సంవత్సరాల నుంచి రోడ్డు సౌకర్యం లేక రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుందని అన్నారు. ఇప్పటి వరకు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో రోడ్డు సౌకర్యం చేయలేక పోయారని వాపోయారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు దర్మన్న, గణపతి, గంగాధర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాల పరిశీలన



నవతెలంగాణ-బోథ్

విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించేందుకు జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సర్వేలో భాగంగా సోమవారం డైట్ కళాశాల విద్యార్థులు సోమవారం మండలంలోని గుట్ట పక్కతండ, బంజారతండలో ఎంపీపీఎస్ పాఠశాలలో మూడో తరగతి విద్యార్థుల కనీస సామర్థ్యాలను పరీక్షించారు. అదేవిధంగా ఉపాధ్యాయుల పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిప్పల్‌ధరి, కుచులాపూర్, ఎంపీపీఎస్, బోథ్, ధన్నూర్(బి), గ్రామాల పాఠశాలలో సర్వే మూడురోజుల పాటు నిర్వహించనున్నారు. సీఆర్పీ ఎస్.దత్తురామ్ తెలిపారు.

కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

- భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వేలిముద్ర సిస్టంను మార్చివేసి ఐరిస్ పద్ధతిని పెట్టి కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బిల్డింగ్ అండ్ అండర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2022 అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిళ్ల ఇస్తామని ప్రకటించారని, నేటికి సంవత్సరం దాటిన మోటార్ సైకిల్ సంబంధించిన రూల్స్ రూపొందించలేదన్నారు. మోటార్ సైకిల్ వస్తుందని ఆశించిన కార్మికులకు నిరాశనే మిగిలిందన్నారు. వెంటనే విధి విధానాలు రూపొందించి వెల్ఫేర్ బోర్డులో కార్డు ఉన్న కార్మికులందరికీ మోటార్ సైకిల్స్ మహిళా కార్మికులకు స్కూటర్స్ అందించాలని అన్నారు. మరణించిన కార్మికుల కుటుంబానికి రావాల్సిన సంక్షేమ పథకాలను దరఖాస్తు చేసుకోనుట కోసం మీసేవ కేంద్రాల వద్దకు వెళ్లి ఆన్‌లైన్ కావట్లేదని సమాధానం ఎదురు అవుతుందన్నారు. పనిచేసే కార్మికుల వేలి ముద్రలు పడలేదని మీసేవ చుట్టూ, ఆఫీసుల చుట్టూ తిప్పుతున్నారని అన్నారు. కార్డులు, నష్టపరిహారాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 1996 నిర్మాణ కార్మికుల చట్టం 1979 వలస కార్మికుల చట్టాలను పునరుద్ధరించాలన్నారు. ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిన మోటార్ సైకిల్, మహిళలకు స్కూటీలు వెంటనే ఇవ్వాలన్నారు.

వేలిముద్ర పద్ధతితో పాటు ఐరిస్ పద్ధతిని పెండింగ్ క్లెయిమ్స్ వెంటనే పరిష్కరించి, నిధులు విడుదల చేయాలన్నారు. ఇతర డిమాండ్లను పరిష్కారం చేయాలని కోరారు. కార్డు ఉన్న కార్మికునికి సొంత ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం



అందించాలన్నారు. కార్యక్రమంలో బీసీడబ్ల్యూఎఫ్ జిల్లా కన్వీనర్ బొజ్జ ఆశన్న, బీసీడబ్ల్యూఎఫ్ జిల్లా కోకన్వీనర్ దుమల అశోక్, నాయకులు ఏ.విఠల్, బి.విఠల్, నరేష్, శ్రీకాంత్, అంకత్ నరేష్, భగవాన్, అశోక్, డి.ఆశన్న పాల్గొన్నారు.

ముదిరాజ్ పట్టణ కమిటీని సన్మానించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఐక్యంగా ఉంటూ సంఘాల బలోపేతానికి పాటుపడాలని ఎమ్మెల్యే జోగు రామన్న సూచించారు. పట్టణ ముదిరాజ్ సంఘం కార్యవర్గ ఎన్నికలను ఆదివారం నిర్వహించగా, సంఘం పట్టణ అధ్యక్షులుగా దారవేణి రాము విజయం సాధించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియచేశారు. అంతకు ముందు చైర్మెన్ నూతన కమిటీ సభ్యులను శాలువాతో ఘనంగా సత్కరించారు. సంఘం ఉపాధ్యక్షులుగా దాసరి రవి, కోశాధికారిగా సంతోష్‌లు ఎన్నికల్లో విజయం సాధించగా, వారికి మిఠాయిలు తినిపించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం పట్టణ అధ్యక్షులు దారవేణి రాము మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో యువత ఎక్కువ సంఖ్యలో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారని పేర్కొన్నారు. ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించిన ఆయన సంఘం అభ్యున్నతికి అహర్నిశలు పాటు పడతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పోచ్చన్న, రాజు, బుట్టి శివ, గణేష్, కృష్ణ పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆలయ వాగ్దేవి సొసైటీ నాగరాజు

నవతెలంగాణ-బాసర

సరస్వతిదేవి అమ్మవారి సన్నిధిలో హైదరాబాద్‌కు చెందిన భక్తురాలు సోమవారం అమ్మవారి దర్శనానికి వచ్చి రూ.లక్ష విలువ గల తులం నర చైన్ పోగొట్టుకుంది. ఆలయంలో విధులు నిర్వహించే వాగ్దేవి సొసైటీ లేబర్ నాగరాజుకు బంగారు చైన్ లభించడంతో ఆలయంలోని మైక్ సెట్ ద్వారా అనౌన్స్ చేయించి భక్తురాలికి బంగారు చైన్‌ను ఆలయ అర్చకులు మదన్ మహారాజ్ ఆధ్వర్యంలో అందజేశారు. దీంతో వాగ్దేవి సొసైటీ లేబర్ నాగరాజును భక్తులు ఆలయ అధికారులు అభినందించారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం మావల తహసీల్దార్‌కు సోమవారం బీఆరఎస ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు గాలిపెల్లి నాగన్న, పార్లమెంట్ కార్యదర్శి గంగసారపు ఓమన్న, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి భాను రాజేశ్వరరావు, మండల నాయకులు పతిహర ప్రభాకర్, కే.నరేందర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

అర్హులైన వారికి అన్యాయం

- యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి రూపేష్‌రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వికలాంగులకు ఆసరా పెన్షన్ ద్వారా ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలుస్తుంటే, రిమ్స్ వైద్యులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి అన్నారు. ఈ విషయమై సోమవారం రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్ మంజూరు విషయంలో అర్హులైన వారికి అన్యాయం చేస్తున్నారని అన్నారు. కండ్లముందే వికలాంగత్వం కనిపిస్తున్న వైద్యులు మాత్రం వికలాంగుడు కాదని తమకు నచ్చకపోతే డబ్బులు ముట్ట చెప్పకపోతే రిజెక్ట్ చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితి బేల మండలంలోని దహేగావ్ గ్రామానికి చెందిన ఒక బాలుడికి ఏర్పడిందన్నారు. దహేగావ్ గ్రామానికి చెందిన బాలుడు ఎండి.అయాజుద్దీన్ పుట్టుకతో వికలాంగుడు. కానీ వైద్యులు సర్టిఫికెట్ల జారీలో అవినీతి అక్రమాలకు పాల్పడుతూ బాలుడికి పెన్షన్ రాకుండా చేశారు. ముడుపులు ముట్ట చెప్తే వికాలాంగుడు కాకపోయినా సర్టిఫికెట్ ఇచ్చే పరిస్థితిని తీసుకువస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రిమ్స్ డైరెక్టర్, స్పందించి అర్హులను గుర్తించి, సదరం సర్టిఫికెట్ మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుతం ప్రభుత్వం అందించే రూ.4016 పెన్షన్ కు దూరమైన బాలుడికి న్యాయం చేయాలన్నారు. సానుకూలంగా స్పందించిన రిమ్స్ డైరెక్టర్ ఎంక్వయిరీ చేసి బాలుడికి పెన్షన్ వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అఖిల్ ఉన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి

- తుడుం దెబ్బ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

తమ కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని, తుడుం దెబ్బ ఆధ్వర్యంలో సోమవారం కాలనీ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు కాలనీవాసులు ర్యాలీ నిర్వహించారు. మావల మండలంలోని బట్టిసావర్‌గాం శివారులోని కుమురం భీం కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్‌కు ప్రజా ఫిర్యాదుల విభాగంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్ మాట్లాడారు. బట్టి సవర్‌గాం శివారంలో సర్వే నెంబర్ 72లో నివాసముంటున్న ఆదివాసులకు జీఓ నెంబర్ 58 ప్రకారం ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, అదేవిధంగా గృహలక్ష్మి పథకం ద్వారా ఇండ్లు మంజూరు చేయాలని అన్నారు. అదేవిధంగా నీటి సౌకర్యం, కరెంటు, రోడ్డు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ముందుగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక సంజీవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్సెంగా తానాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావ్, ఉపాధ్యక్షులు కుమ్రం శ్యాంరావ్, ప్రచార కార్యదర్శి వెట్టి మానోజ్, ఆదివాసీ మహిళ సంఘం జిల్లా అధ్యక్షులు గోడం రేణుక బాయి, జిల్లా ఉపాధ్యక్షులు ఉయిక ఇంద్రబాయి, మెస్రం గంగాదేవి, డివిజన్ ఉపాధ్యక్షురాలు కుమ్ర శాంతాబాయి, ముకుంద్ రావ్, దుర్వ జూగాదిరావ్, మావల మండల తుడుందెబ్బ అధ్యక్షులు ఆత్రం గణపతి, కుడ్మెత ప్రకాష్, కుమురం భీం గూడ కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు స్థానిక గిరిజనులకే కల్పించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

తెలంగాణ రాష్ట్రంలో ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతంలో జీవో నెంబర్ 3ను యథాతదంగా అమలు చేసి, వంద శాతం ఉద్యోగ, ఉపాది అవకాశాలు స్థానిక గిరిజనులకు కల్పించాలని నిరుద్యోగ అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా బీఎడ్, డీఎడ్ పూర్తి చేసిన నిరుద్యోగ అభ్యర్థులు సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వీరికి ఉపాధ్యాయ, గిరిజన సంఘాల నాయకులు ఆత్రం సుగుణ, జగన్, నేతావత్ రాందాస్, బానోత్ రామారావులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐటీడీఏ ఖాళీగా ఉన్న 1800 బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీచేయాలని అన్నారు. ఐటీడీఏ పరిధిలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను స్పెషల్ డీఎస్సీ ద్వారా గిరిజన, ఆదివాసీ నిరుద్యోగులతో వెంటనే భర్తీ చేయాలన్నారు. 1/70 చట్టాన్ని అమలు చేసి, టీఆర్టీలో జీఓ నెం. 3 ప్రకారం ఏజెన్సీలో ఉన్న వాళ్లకు 50 శాతం ఉద్యోగాలు కెటాయించాలని



డిమాండ్ చేశారు. గత ఐదు సంవత్సరాల నుంచి ఐటీడీఏ డీఎస్సీ కోసం తాము ఎదురుచుస్తూ, ఐటీడీఏలో, ట్రైబల్ కమీషనర్ దగ్గర దరఖాస్తు ఇస్తుగా ఐటీడీఏలో పోస్టుల భర్తీ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. అనంతరం ఐటీడీఏ అధికారులను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు దీపక్, సోమేశ్, కిషోర్ ఉన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ప్రభుత్వ పథకాలు, రుణాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక ప్రగతి సాధించాలని ఎమ్మెల్యే జోగు రామన్న సూచించారు. బట్టి సావర్‌గాం గ్రామంలో పీఎంఎఫ్ ఈ కోల్డ్‌ప్రెస్ ఆయిల్ మిల్ యూనిట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్గానిక్‌పై అవగాహన పెంచుకుంటూ, పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని పొందేలా ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కల్తీ ఆయిల్ వినియోగాల ద్వారా గుండె సంబంధిత వ్యాధులు సంభవిస్తాయని సూచించారు. మహిళా సొసైటీ సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి సాధించే దిశగా ఇలాంటి పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నల్ల వనిత రాజేశ్వర్, ఎంపీపీ దర్శనాల సంగీత ఏవన్, ఎంపీటీసీ బిక్కి గంగాధర్, డీపీఎం సుగంధ, ఏపీఎం శేఖర్, దర్శనాల రమ్య, రేఖ, ఆర్గానిక్ మేనేజర్ దర్శనాల సతీష్, దాసరి రమేష్ పాల్గొన్నారు.

మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహ ఏర్పాటు పనుల పరిశీలన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఏర్పాటు చేసిన మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని స్పోర్ట్స్‌డే సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న లాంచనంగా ఆవిష్కరించనున్నారని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం మైదానంలో విగ్రహ ఏర్పాటు పనులను ఆయన పర్యవేక్షించారు. క్రేన్ సహాయంతో మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, ఆవిష్కరణ కార్యక్రమానికి సంబంధించి సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. నేటితరం క్రీడాకారులు హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్‌ను స్పూర్తిగా తీసుకుని క్రీడల్లో ఎదగాలన్న ఉద్దేశంతో ఆయన విగ్రహాన్ని మైదాన ప్రాంగణంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రీడాభిమానులు, క్రీడాకారులు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలని అన్నారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ కోచ్ కృష్ణ, సునీల్ పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని బాల శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా సైన్స్ అధికారి రఘురమణ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలోని ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి శ్రీ సరస్వతి శిశుమందిరం పాఠశాలలో ప్రాథమిక స్థాయి విద్యా వైజ్ఞానిక మేళాకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా జిల్లా, రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సైన్సు ప్రదర్శన నిర్వహించడం అనేది చాలా గొప్ప విషయమని అన్నారు. ఈ మేళాలో గణిత, సామాన్య శాస్త్రం సంబంధించిన 60కి పైగా ప్రదర్శనలు పాఠశాలలో ప్రదర్శింపజేశారు. ఈ ప్రదర్శనలు చూడటానికి పోషకులు వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విభాగ్ సైక్షిక్ ప్రముఖ వేణుగోపాల్, కార్యదర్శి చదల రాజేశ్వర్, సతీష్ దేశ్‌పాండే, మధుజీ ప్రధానాచార్యులు నర్సింగరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్ బాబుకు ఘన స్వాగతం

నవతెలంగాణ-బాసర

ఇటీవల హైదరాబాద్‌లో స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్ బాబును తోసేసి చేయి చేసుకున్న ఘటనపై రాజేష్‌బాబు అభిమానులు, కార్యకర్తలు జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించారు. సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, క్షమాపణలు కోరడంతో వివాదం సద్దుమనిగింది. సోమవారం హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గం గుండా బాసర గోదావరి నది వద్దకు చేరుకోగానే మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్‌బాబు అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనకు ఘన స్వాగతం పలికారు. సుమారు 50పైగా కార్లతో, 100కు పైగా ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహిస్తూ భైంసాకు పయనమయ్యారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్‌బాబు మాట్లాడుతూ నా వివాదంపై అండగా నిలిచిన అభిమానులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని నాకోసం ఆందోళన చేసిన కార్యకర్తలకు కంటికి రెప్పలా కాపాడుకుంటానని భావోద్వేగంగా



ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బాసర జెడ్పీటీసీ వసంతా రమేష్, నాయకులు పాల్గొన్నారు.

అన్నాభావు సాఠే అడుగు జాడల్లో నడవాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

అన్నాభావు సాఠే అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మా బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం ఆయన మండలకేంద్రంలో అన్నాభావు సాఠే 103వ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి




పూలమాలలు వేసి నివాళులర్పించి, జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాఠే బడుగు, బలహీన వర్గాల కోసం చూపించిన మార్గంలో నడవాలని కోరారు ఆయన దళితుల కోసం అనేక మార్పులు తెచ్చిన మహనీయుడని కొనియాడారు. ఈ సందర్భంగా తీసిన ర్యాలీలో అయన పాల్గొన్నారు. అనంతరం గౌరాపూర్ గ్రామంలో పర్యటించారు. గ్రామస్తుల సమస్యలను వారితో మాట్లాడి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం మేనిఫెస్టోను రూపొందించిందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. ఈ సంధ్భంగా అయన వెంట ముఖాడే ఉత్తం, కె.బాలాజీ, నాగోరావు ఉన్నారు.

ఓటమే లక్ష్యంగా కలిసి పనిచేస్తాం

- కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ ఎమ్మెల్యే అవినీతి పాలనకు చరమగీతం పలుకుతామని వచ్చే ఎన్నికలలో ఆయన ఓటమే లక్ష్యంగా అంతా కలిసి పని చేస్తామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకొని జిల్లాకేంద్రానికి విచ్చేసిన ఆయనకు పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు. మావల నుంచి పట్టణంలోని ప్రధాన కూడళ్ల గుండా ఆయన క్యాంపు కార్యాలయం ప్రజాసేవాభవన్ వరకు బైక్ ర్యాలీ కొనసాగించారు. అనంతరం ప్రజా సేవాభవన్‌లో సమావేశమైన నాయకులు, కార్యకర్తలకు పార్టీ బలోపేతానికి దిశానిర్దేశం చేశారు. అంతా కలిసికట్టుగా పని చేస్తే గెలుపు తథ్యమన్నారు. తామంతా ఒకే కుటుంబమని జోగు రామన్న ఓటమే లక్ష్యంగా కలిసి పని చేస్తామని స్పష్టం చేశారు. దేశమంతటా కాంగ్రెస్ పవనాలు వీస్తున్నాయని ఆదిలాబాద్ గడ్డ మీద కాంగ్రెస్ జెండా ఎగరడంతో పాటు రాష్ట్రంలో కేంద్రంలో తమ ప్రభుత్వమే రానుందన్న ధీమాను వ్యక్తం చేశారు. ఈ ర్యాలీలో అభిమానులు, నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి

నవతెలంగాణ-బోథ్

నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండలో రోడ్డు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిలను బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్



సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా బోథ్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శిఖర్ కైలాష్ టెక్డి శివాలయానికి వెళ్లడానికి రోడ్డు సౌకర్యం కోసం రూ.12 కోట్లు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీపీ తుల శ్రీనివాస్, నేరడిగొండ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్ డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లతో కలిసి స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లకు జరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26,000 చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించడంతోపాటు ఉద్యోగ భద్రత అందించాలన్నారు. ఆశా వర్కర్లకు హెల్త్ కార్డులు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. పదవి విరమణ కల్పించి అన్ని రకాల పథకాలు వర్తింపచేయాలన్నారు. పని భారాన్ని తగ్గించాలని 32 రకాల రిజిస్టర్లు ప్రభుత్వం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపకపోతే భవిష్యత్తులో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తల సంఘం నాయకులు వాణి, లలిత, దేవి పాల్గొన్నారు.

రైతులకు సరిపడా ఎరువుల పంపిణీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతుల అవసరానికి సరిపడా ఎరువులు పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ మల్లికార్జున్ తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేసే ఎరువులను ఈదులవాడ గ్రామపంచాయతీలో, రౌటసంకేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో సింగల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్‌తో కలిసి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు ఇబ్బంది పడకుండా చూడడమే లక్ష్యమన్నారు. ఎరువులను సరైన సమయంలో తీసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో వైస్ చైర్మన్ రుకుం ప్రహ్లాద్, సర్పంచ్ భీమేశ్, నాయకులు మధుకర్, దేవబ్రహ్మం, దాసరి మల్లేష్, ప్రభాకర్, గజ్జల కోటేశ్వర్ పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశంలో ఆరు అంశాలతో తీర్మానం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయములో మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ అధ్యక్షతన సోమవారం సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో 6 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపాలిటీలోని చెత్తను తరలించే ట్రాక్టర్ ఆటోల ఇంజన్ ఆయుల్, మరమ్మతులకు అయిన ఖర్చులకు రూ. రెండు లక్షలు, విధి దీపాలకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు అయిన ఖర్చు రూ.4 లక్షలు, పలు వార్డులో మున్సిపాలిటీకి సంబంధించిన ఖాళీ స్థలంకు కంచె వేయుటకు అయిన ఖర్చు రూ.51 వేయి, నీటి సరఫరాకు మోటారు పంపుల మరమత్తులకు లికేజీలు, ఊత క్రరలు కెమికల్స్ కొనుగోలుకు అయిన ఖర్చు రూ.94,515 రూ,86000, కార్యాలయంలో స్టేషనరీ ఫైల్ ప్యాడ్, బ్యాకర్స్ ముద్రణాకు, కొనుగోలు రూ.50000 సభ్యులు ఆమోదం తెలిపారు. అలాగే విద్యుత్ ఏఈ జయ కృష్ణ, పట్టణములోని విద్యుత్ స్థంబాలు ఏర్పాటు, విద్యుత్ స్థంబాల మార్పిడి, విద్యుత్ లైన్ మార్పిడి వివిధ రకాల సమస్యల గురించి గౌరవ కౌన్సిల్ సభ్యులు వివరించి వాటిని వెంటనే పరిష్కరించవలసినదిగా కోరినారు. ఈ సమావేశంలో కమిషనర్ జి.వెంకటనారాయణ, వైస్ చైర్మన్ విద్యా సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

1న పాత వాహనాల విడిభాగాలకు వేలం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పోలీస్ శాఖకు సంబంధించిన వాహనాలకు వాడిన టైర్లు, బ్యాటరీలు, ఇంజన్ ఆయిల్‌తో పాటు విడిభాగాలను సెప్టెంబర్ 1న వేలం వేస్తున్నట్టు ఎస్పీ సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం10 గంటలకు పోలీస్ హెడ్‌క్వాటర్స్‌లో మోటార్ వెయికిల్ కార్యాలయంలో వేలం ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు పూర్తి వివరాలకు పోలీస్ వాహనాల అధికారి కే.అంజన్న (ఆర్ఐ ఎంటీఓ) 8712670517 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

మండల దివ్యాంగుల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని 29 గ్రామ పంచాయతీలకు చెందిన దివ్యాంగులు, ఆ సంఘం ఆధ్వర్యంలో నూతన మండల కమిటీని సోమవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా ఆకుల మల్లేష్ , అధ్యక్షుడిగా ఐలవేణి నరసయ్య , ఉపాధ్యక్షుడిగా నారపాక జయరాజ్, మామిడిపల్లి చంద్రశేఖర్, కార్యదర్శి జాడి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా పత్రి భాగ్యలక్ష్మి, దువ్వాక రాజు, జాడి అనిల్, కోశాధికారిగా కాల్వ సుగుణ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మామిడిపల్లి ఇందయ్యా, బుడిగ జంగాల మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఈర్నాల గంగన్న పాల్గొన్నారు.

చలో మైదాన్‌తో క్రీడాస్ఫూర్తి పెరుగుతుంది

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్
- చలో మైదాన్ పోస్టర్ల విడుదల



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయ క్రీడ దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించే చలో మైదాన్ కార్యక్రమంలో క్రీడా స్ఫూర్తి పెరుగుతుందని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ తెలిపారు. ఆగస్టు 29 జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో నిర్వహించే చలో మైదాన్ ప్రోగ్రాం పోస్టర్‌లను జిల్లా అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలో మైదాన్ విజయవంతం చేసే విధంగా ప్రయత్నాలు చేయాలన్నారు. జిల్లా క్రీడల అధికారిని రమాదేవి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో చలో మైదాన్ కార్యక్రమంలో భాగంగా ఉదయం ఏడు గంటలకు జనకాపూర్ నుంచి కుమురంభీం భవన్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం చలో మైదాన్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పోస్టర్‌లను జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సాంబశివ రావు, టీడబ్ల్యూఎస్ఓ బండ మీనారెడ్డి, క్రీడా పాఠశాల హెచ్ఎం ఎస్.కృష్ణారావు, పేట సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేందర్, కృష్ణమూర్తి, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు విద్యాసాగర్, మధుసూదన్, క్రీడా పాఠశాల శిక్షకులు విద్యాసాగర్, అరవింద్ పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

నవతెలంగాణ-జన్నారం

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఐ(ఎం), సీఐటీయూ నాయకులు కోరారు. సోమవారం సీపీఐ(ఎం) కార్యాలయంలో విద్యుత్ దినోత్సవం సందర్భంగా, బషీర్బాగ్ సంఘటనలో అమరవీరులైన విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ బాలస్వామి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలపై భారం పడేలా ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచడం సరికాదన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనికరపు అశోక్, మండల నాయకులు గుడ్ల రాజన్న, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఆత్రం రాజు, ఆత్రం సుధాకర్, సంతోష, ఎస్కే అబ్దుల్లా సీఐటీయూ నాయకులు కే.బుచ్చయ్య పాల్గొన్నారు.

రేషన్.. పరేషాన్..!

- సరుకులకు ఆటంకంగా పెద్ద వాగు
- ఇబ్బందుల్లో ఖైరి జీపీ ప్రజలు



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని ఖైరి గ్రామ పంచాయతీ పరిధిలోనిలోని నాలుగు గ్రామాల ప్రజలు రేషన్ సరుకులు తెచ్చుకునేనెందుకు అష్ట కష్టాలు పడుతున్నారు. ఖైరి పంచాయతీ పరిధిలోని మలగూడా, ఇంద్రనగర్, నాయకపుగూడ, ఖైరి గ్రామాల ప్రజలు సుమారు వెయ్యి జనాభా ఉంటుంది. నాలుగు గ్రామాల్లో 350 రేషన్ కార్డులున్నాయి. రేషన్ సరుకుల కోసం సుమారు 3కిమి దూరంలో ఉన్న మోడీ గ్రామానికి వెళ్లాల్సి ఉంటుంది. మోడీ గ్రామం వరకు రోడ్డు సౌకర్యం బాగానే ఉన్నా మార్గ మధ్యలో పెద్ద వాగు తోనే సమస్య ఏర్పడుతుంది. ఏటా వర్షాకాలం మొదలు వేసవి కాలం వరకు వాగులో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో అటు వైపు వాహనాలు గ్రామాల వైపు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వాగు అవతల వైపుకు దాటి వెళ్ళడానికి వీలు పడదు. వాగులో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో వాగు దాటి రేషన్ దుకాణానికి చేరుకోలేని దుస్థితి నెలకొంది. దీంతో ప్రతి నెల రేషన్ సరుకుల కోసం నాలుగు గ్రామాల ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. ఏ చిన్న పనికి మండల కేంద్రానికి రాక తప్పదు. ప్రతి రోజు రాకపోకలు కొనసాగించే ప్రజలు ప్రయాణ ఖర్చుల భారం తప్పడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఖైరి గ్రామంలో రేషన్ దుకాణం మంజూరు చేయాలని కోరుతున్నారు.

చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే

ఖైరి నుండి మోడీ గ్రామం కూత వేటు దూరంలోనే ఉన్న మార్గ మధ్యలో పెద్ద వాగు అడ్డంకిగా మారడంతో రేషన్ సరుకులు తీసుకొచ్చేందుకు ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఇంద్రనగర్, సాంగ్వి గ్రామాల మీదుగా ఆటో, ద్విచక్ర వాహనాలు సుమారు 15 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాలి. రాను పోను 30 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలి. రేషన్ సరుకుల కోసం తక్కువ డబ్బులు వేచించాల్సి ఉన్న ఆటోల ద్వారా ప్రయాణ ఖర్చులే రూ.120 అవుతోంది. వ్యయ ప్రయసాలతో దూరభారం తప్పడంలేదు. రోజంతా రేషన్ సరుకుల కోసం విలువైన సమయాన్ని వెచ్చించి చుట్టు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది.

పట్టించుకోని అధికార యంత్రాంగం

ఖైరి గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలకు రేషన్ సరుకులు తీసుకొచ్చేందుకు వాగు అడ్డుగా మారిందని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రంలో తహసీల్దార్‌కు పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చామని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఖైరి గ్రామంలో రేషన్ సరుకుల దుకాణం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు

పోచయ్య నాయకపు గూడ గ్రామస్తుడు



గ్రామంలో రేషన్ దుకాణం లేకపోవడం వల్ల గత కొన్ని నీళ్ల గా అనేక ఇబ్బందులు పడుతున్నప్పటికీ అధికారులు ప్రజాప్రతినిధులు ఎవరు పట్టించుకోవడం లేదు. గతంలో తహసీల్దార్‌కు పలమార్లు తమ సమస్యను వివరించినప్పటికీ రేషన్ షాప్ ఏర్పాటు దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. బయోమెట్రిక్ ఉండడం వల్ల ఇంట్లోని ఓ వ్యక్తి రేషన్ బియ్యం కోసం తప్పనిసరిగా వెళ్లాల్సి ఉంటుంది. దీంతో వ్యవసాయ పనులు వదిలేసి రేషన్ బియ్యం కోసం 15 కిలోమీటర్ల దూరం ప్రయాణించక తప్పడం లేదు.

రేషన్ దుకాణం మూజురు చేయాలి

లేస్గూరే బాలాజీ ఖైరి గ్రామస్తుడు



ఖైరి గ్రామంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయడంతో నాలుగు గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది. దూర భారం తగ్గుతుంది. ప్రస్తుతం రేషన్ బియ్యానికి వెచ్చించే ఖర్చు కన్నా ప్రయాణపు ఖర్చులే ప్రజలకు అదనపు భారం అవుతోంది. దూర భారంతో పాటు వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడుతుంది. రేషన్ బియ్యం కోసం దినమంత గడిచిపోతుంది. రేషన్ దుకాణం ఏర్పాటుకు గతంలో రేషన్ కార్డుల వివరాలు స్థానిక రెవెన్యూ అధికారులు సేకరించారు. అయిన ఎలాంటి స్పందన లేదు.

దుకాణం మంజూరుకు కృషి చేస్తా

లెస్గూరే విజయలక్ష్మి ఖైరి సర్పంచ్



ఖైరి గ్రామంలో రేషన్ దుకాణం లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ దుకాణం గ్రామానికి దగ్గరలోనే ఉన్నప్పటికీ ప్రధానా అడ్డంకిగా వాగు ఉండడంతో నాలుగు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రేషన్ సరుకులు తెచ్చుకోవడంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ దుకాణం ఏర్పాటుకై గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. జడ్పీ చైర్ పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు దృష్టికి తీసుకెళ్లి ఖైరిలో రేషన్ దుకాణం మంజూరుకు కృషి చేస్తా.

రెండవ ఏఎన్ఎంల రాస్తారోకో



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రెండో ఏఎన్ఎంలను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెలో భాగంగా 13వ రోజు సోమవారం అంబేద్కర్‌చౌక్ వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ అధ్యక్షతన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ గత 12 రోజులుగా ఏఎన్ఎంలు రోడ్డుమీదికి వచ్చినప్పటికీ ప్రభుత్వానికి కనీస పట్టింపు లేకుండా పోయిందన్నారు. వైద్య శాఖలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకోకపోగా నూతన నోటిఫికేషన్ వేయడం వారి హక్కులను కాలరాయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నోటిఫికేషన్ రద్దుచేసి ఏఎన్ఎంలను తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారికి అండగా సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం చేస్తామని తెలిపారు. ఏఎన్ఎంలను బేషరతుగా రెగ్యులర్ చేయాలని లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. రాస్తారోకోకు సీపీఐ మండల కార్యదర్శి బద్రి సత్యనారాయణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, ఏఎన్ఎంల రాష్ట్ర నాయకురాలు వసంత, జిల్లా అధ్యక్షులు సంతోషి, జిల్లా ప్రధాన కార్యదర్శి పుణ్యవతి, ఉపాధ్యక్షులు భాగ్య, రజిని, ప్రచార కార్యదర్శి కమల, భూదేవి, ప్రమీల, కోశాధికారి సునీత, నాయకులు తిరుమల, మీనా, సునీత, రాజేశ్వరి పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని గతకొన్ని సంవత్సరాల నుండి ప్రభుత్వానికి విన్నవించిన పట్టించుకోకుండా వారితో వెట్టిచాకిరి చేయించడం ఎంతవరకు సమంజసమని సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. సోమవారం ఇన్‌ఛార్జి తహసీల్దార్ లలితకు తమ న్యాయమైన డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు కవిత, నిర్మళ, శారద, సంగీత, మౌనిక, విశాక, పుష్ప, అనసూర్య, గీత పాల్గొన్నారు.

చెన్నూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి



నవతెలంగాణ-చెన్నూర్

గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ చెన్నూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తామని విస్మరించాలరని, ఈ ఎన్నికల లోగా రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని బీజేపీ పెద్దపెల్లి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో మందమర్రిలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో హామీ ఇచ్చారని, హామీ ఇచ్చిన అనంతరం 17 రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేశారని, ఇటీవల భూపాలపల్లి జిల్లా కాటారంను సైతం రెవెన్యూ డివిజన్‌గా గెజిట్ విడుదల చేశారని గుర్తు చేవారు. చెన్నూరు రెవెన్యూ డివిజన్ అంశం మాత్రం ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పట్టించుకోవడంలేదని ఆయన ఆరోపించారు. గత ఎన్నికల సమయంలో ప్రభుత్వ విప్ సుమన్ ఆస్నాద్ మండల కేంద్రంగా, పారుపల్లి మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తానని, ఒకవేళ ఏర్పాటు చేయలేక పోతే మళ్లీ ఎన్నికల్లో ఓట్లకు రానని ప్రచారం చేశారని, ఇప్పుడు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. పాత బస్టాండ్ నుంచి చెరువు కట్ట రాగి చెట్టు కనబడేటట్లు రోడ్డు అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారని, ఆ హామీని సైతం సుమన్ మరిచిపోయారని, ఫలితంగా పట్టణ అభివృద్ధి కుంటుపడిందని, వ్యాపారులు కొత్త బస్టాండ్ వైపు తరలిపోతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శుద్ధపల్లి సుశీల్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాస్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏతం శివ, దళిత మోర్చా పట్టణ అధ్యక్షుడు గడిపల్లి సంతోష్, బీజేపీ సీనియర్ నాయకులు కొరకుప్పుల వంశీ పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలి

నవతెలంగాణ-తాండూర్



చోరీకి గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించాలని బోయపల్లి రైతు గుగ్గిళ్ళ రాజబాబు గౌడ్ విద్యుత్ అధికారులను కోరారు. సోమవారం ప్రజా వాణిలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ విన్నవించారు. గత సంవత్సరం ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురికాగా తాండూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ కాపీ విద్యుత్తు అధికారులకు సమర్పించినట్లు తెలిపారు. విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ దొంగిలించబడి సంవత్సరం అయినప్పటికీ విద్యుత్ అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయడం లేదని పేర్కొన్నారు.

కలెక్టరేట్‌లో ప్రజలకు సౌకర్యాలు కల్పించాలి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నూతన సమీకృత కలెక్టరేట్‌లో ప్రజలకు కనీస సౌకర్యాలు కలిపించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటి తరుపున సోమవారం ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆ పార్టీ మాట్లాడుతూ నూతన కలెక్టర్ భవనాన్ని ప్రారంభించి 3 నెలలు గడుస్తున్న నేటి వరకు కనీస సౌకర్యాలు ప్రజలకు అందుబాటులో లేవని అన్నారు. కలెక్టరేట్‌కు జిల్లాలోని అనేక మండలాల ప్రజలు వివిధ పనుల రీత్యా కలెక్టరేట్‌కు సమస్యలను చెప్పడానికి వస్తే కనీస త్రాగు నీళ్ళు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా మూత్రశాలలు ఉన్న కూడా వాటికి నీటి సరఫరా లేక తాళాలు వేసి ఉండటం వలన అత్యవసర పరిస్థితిలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతే కాకుండా వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు కలెక్టరేట్‌లోని అయా శాఖల అధికారులకు ప్రజలు సమస్యలను వివరించడానికి వస్తే ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండటం లేదన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పిస్తామని ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్, నాయకులు జాడి మల్లయ్య, బొరుకుటే శ్యామ్ రావు, గెడం టీకానంద్ పాల్గొన్నారు.

బీసీలకు ప్రాధాన్యత ఇవ్వని పార్టీలకు గుణపాఠం చెప్పాలి

- బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రూప్నర్ రమేష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జనాభా ప్రాతిపదికన బీసీలకు టికెట్లు కేటాయించని పార్టీలకు రానున్న ఎన్నికల్లో బీసీలు తగిన గుణపాఠం చెప్పాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్ అన్నారు. బీసీల చైతన్య యాత్రలో భాగంగా మండలంలోని అంకుసాపూర్ గ్రామంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం బీసీలకు రాజకీయ ఆర్థిక సామాజిక రంగాలలో వాటా తప్పని సరిగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ లపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని బీసీలలోని కేవలం కొన్ని కులాలకు మాత్రమే రూ.లక్ష ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. బీసీలంటే బిక్షగాల్లు కాదని బీసీలకి వెంటనే రూ.10 లక్షల బీసీ బంధు ప్రకటించాలని డిమాండ్ చేశారు. తమ ఓట్లతో గెలిచిన ప్రభుత్వాలు తమను లెక్కచేయకుండా వ్యవహరిస్తున్నాయని దీనిని సహించేది లేదని బీసీల సమస్యలన్నీ రాజ్యాధికారంతోనే సాధ్యం అవుతాయన్నారు. దానికోసం ప్రతి యువకుడు నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్, రైతు అధ్యక్షుడు మారుతి పటేల్, బీసీ యువజన సంఘం ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షులు బొట్టుపల్లి ప్రశాంత్, బీసీ సంఘం ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు సిరికొండ సాయి కృష్ణ, ఆడే సాగర్, గ్రామ పటేల్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన దుర్గం భాస్కర్

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి నివాసంలో సోమవారం చెన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఓయు టీఎస్ జేఏసీ దుర్గం భాస్కర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నూరు నియోజకవర్గ అభ్యర్థిగా ఉస్మానియా విద్యార్థి నాయకుడిని అయిన తనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే చెన్నూర్ నియోజకవర్గ సమస్యలపై కాంగ్రెస్ బలోపేతం గురించి చర్చించడం జరిగిందని తెలిపారు.

అర్హులకే సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

నవతెలంగాణ-మందమర్రి

అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా పట్టణ కన్వీనర్ మోయ్య రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి పాత వీరస్వామి, కార్యదర్శి రంజిత్ కుమార్‌లు మాట్లాడుతూ దళిత బంధు, బీసీ బందు, గిరిజన బంధు, డబుల్ బెడ్ రూమ్, గృహలక్ష్మి లాంటి సంక్షేమ పథకాలని రాజకీయాలకు అతీతంగా అమలు చేయాలని దళిత బంధు ఆన్‌లైన్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే కాకుండా అర్హులైన పేదలందరికీ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాగంటి లక్ష్మణ్, నీరెడి శ్రీశైలం, బీసీ సంఘం కార్యదర్శి జమాల్ పూరి, నర్సోజి, రాజేశం, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌ఛార్జి సారంగం, ఎమ్మార్పీఎస్ టౌన్ జనరల్ సెక్రెటరీ సదానందం, రాజు, విజయ్, రాజయ్య, మల్లేష్, శ్రావణి, తిరుపతి పాల్గొన్నారు.

ఆశాలు మృతి తీరని లోటు

నవతెలంగాణ-కాసిపేట

కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బన్న ఆశాలు మృతి మండలానికి, కాంగ్రెస్‌కు తీరని లోటు అని పెద్దనపల్లి సర్పంచ్ వేముల కృష్ణ పేర్కొన్నారు. అయన తన రాజకీయ గురువు అని ఆవేదన వ్యక్తం చేశారు. అయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే జాతీయ మాల మహానాడు రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు గజ్జెల్లి లక్ష్మణ్, నస్పూరి నర్సింగ్, పైడిమల్ల నర్సింగ్, సో గాల సాగర్, ఎర్రం ప్రభాకర్, బన్న శ్రీనివాస్, బన్న రవి, మేడ సమ్మయ్యలు నివాళ్ల అర్పించారు.

క్రీడాకారులకు వాలీబాల్ కిట్ పంపిణీ

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని గోయగావ్ గ్రామంలో సోమవారం క్రీడాకారులకు ఎస్సై సాగర్ వాలీబాల్ కిట్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సన్మార్గంలో నడిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన సూచించారు. యువత క్రీడల్లో రాణించి ఉన్నత చదువులు చదువుకోవాలని, రానున్న రోజుల్లో ఉద్యోగావకాశాల నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉన్నందున యువత చక్కగా చదువుకొని ఉద్యోగాలు సాధించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఎవరైన అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని యువతను, గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బబ్లు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 29 ఆగస్టు 2023

మహిళల భద్రత పోలీసుల బాధ్యత
నవతెలంగాణ - హాజీపూర్

మహిళల భద్రత పోలీసుల బాధ్యత అని ఎస్సై నరేష్ అన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం వేంపల్లి ఎస్ఆర్ఆర్ కాలేజీలోని విద్యార్థులకు సైబర్ మోసాలు, ఉమెన్ సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పోలీసు అధికారులకు విద్యార్థినులు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పోలీసులు ఎల్లప్పుడూ రక్షణగా ఉంటారన్నారు.



బదిలీపై వెళ్లిన సీఐని సన్మానించిన ఎస్పీ
నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో స్పెషల్ బ్రాంచ్ సిఐగా విధులు నిర్వహించి రామగుండం కమిషనరేట్‌కు బదిలీపై వెళ్లిన సిఐ సుధాకర్‌ను ఎస్పీ సురేష్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీలు ప్రభుత్వ ఉద్యోగులకు సహజమని, పనిచేసిన చోట ప్రతి ఒక్కరు గుర్తుంచుకునే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు. సుధాకర్ స్పెషల్ బ్రాంచ్ సిఐగా చాలా బాగా విధులు నిర్వహించారని కితాబునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, డిసిఆర్‌బి డిఎస్పీ రమేష్ పాల్గొన్నారు.



శిక్షణ ఐఏఎస్ అధికారుల పర్యటన



నవతెలంగాణ-సిరికొండ

శిక్షణ ఐఏఎస్ అధికారులు గిరిజన గ్రామాల్లో పర్యటిస్తున్నారు. మొత్తం ఏడుగురు శిక్షణ ఐఏఎస్ అధికారులు సోమవారం రాజంపేట్, రిమ్మా గ్రామాలలో పర్యటించారు. వచ్చే నెల 3వరకు వీరి పర్యటన ఉంటుంది. గిరిజనుల స్థితిగతులు, ఆచార వ్యవహారాలు, పని తీరు, విధి విధానాలు, జీవన శైలి తదితర విషయాలపై అధ్యయనం చేయనున్నారు. రాజంపేట్ గ్రామంలో గిరిజనులతో వ్యవసాయ పంటల సాగు, జీవన విధానాల గురించి ఆరా తీశారు. అనంతరం రిమ్మ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో కలిసి ప్రభుత్వ పథకాలు, గ్రామంలో ఎంత జనాభా ఉంది, పింఛన్‌దారులకు పింఛన్లు వస్తున్నాయా లేదా అనే విషయాలపై అధ్యయనం చేశారు. వారికి సలహాలు, సూచనలు అందజేసి వారితో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమృత్‌రావ్, ఎంపిడిఓ సురేష్, సర్పంచ్ అనిల్ కుమార్, ఎటిడబ్ల్యూఓ సౌజన్య, సార్మేడి అమృత్‌రావ్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి
నవతెలంగాణ - సిర్పూర్(టి)

రాజ్యాంగంలో కల్పించిన చట్టాలపై అవగాహన కలిగి వాటిపట్ల విధేయత చూపుతూ బాధ్యతగా వాటిని సక్రమంగా వినియోగించుకున్నప్పుడే రాజ్యాంగ నిర్మాతల శ్రమ ఫలిస్తుందని సిర్పూర్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి రవి అన్నారు. సోమవారం వేంపల్లి గ్రామంలో మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులు, ఇతర చట్టాలను ప్రతి ఒక్కరు గౌరవించి వాటికి భంగం కల్గించకుండా సక్రమంగా అమలుపరిచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు వి కిశోర్‌కుమార్, గణపతి, కళ్యాణ్, సతీష్, ఎస్సై దీకొండ రమేష్ పాల్గొన్నారు.

సుమన్ ఆరోపణలకు ఖండన
నవతెలంగాణ-మందమర్రి

సుమన్ చేసిన ఆరోపణలను కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సొతుకు సుదర్శన్ ఖండించారు. సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్‌లో కోవర్టులు ఎవరూ లేరని, కేవలం ఓడిపోతాననే భయంతో కార్యకర్తలపై లేనిపోని అబండాలు వేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్‌లోనే కోవర్టులు ఉన్నారని తెలిపారు. ఓదన్నను ఏకాకి చేసి రాజకీయ భవిష్యత్తు లేకుండా చేశాడని తెలిపారు. ఓదన్నను ఎమ్మెల్యేగా చూడాలని సుమన్ చుట్టూ తిరుగుతున్న అనుచరులే ప్రయత్నం చేస్తున్నారని తెలిపాఉఉ. అలాంటి వారిని దగ్గర పెట్టుకుని నిజాయితీగా ఉన్న తమ నాయకులు, కార్యకర్తలపై దుష్ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా ప్రెసిడెంట్ ఎండి ఆఫీస్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎండి పాషా, మాజీ ప్రధాన కార్యదర్శి కడారి వీరస్వామి, ఆలం శంకర్, టౌన్ మాజీ వైస్ ప్రెసిడెంట్ సొతుకు రాజయ్య, పట్టణ మాజీ వైస్ ప్రెసిడెంట్ గుండవేని నాగయ్య పాల్గొన్నారు.

భవిష్యత్తును మార్చేది చదువొక్కటే
నవతెలంగాణ-బోథ్

విద్యార్థుల భవిష్యత్తును చదువొక్కటే మర్చగలుగుతుందని ప్రధానోపాధ్యాయుడు చిట్టి సాగర్ అన్నారు. సోమవారం మండలంలోని మంద బోగుడ ఎంపీఎస్ పాఠశాలలో పీపుల్స్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 17మంది విద్యార్థులకు ఈ విద్యా సవత్సరాంతానికి పనికి వచ్చే విధంగా లెర్నింగ్ మెటీరియల్ ప్రధానోపాధ్యాయుల ద్వారా పంపిణీ చేశారు. విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలలో ప్రతి విద్యార్థికి అవసరమయ్యే పూర్తి మెటీరియల్‌ని అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మన భవిష్యత్తును చదువొక్కటే మార్చగలదని, విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయిలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీపుల్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పెంట సదానంద్, కొట్టూరి శ్యాం, అల్లం సాయి, లింగంపెల్లి సంతోష్, గట్ల బలరామకృష్ణ, ఆడెపు నరేష్, నోముల కుషాల్ రెడ్డి పాల్గొన్నారు.

నిరంతరం ప్రజా సేవలో ఉంటా
నవతెలంగాణ-ముథోల్

నిరంతరం తను ప్రజాసేవలో ఉంటానాని భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్‌బాబు అన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఆయన బాసర నుంచి సోమవారం భారీ మోటార్ సైకిల్, కార్లతో భైంసాకు వెళ్తుండగా ముథోల్‌లో మార్కెట్ చైర్మెన్ రాజేష్‌బాబుకు అనుచరులు ఘన స్వాగతం పలికారు. నయాబాది చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహనికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన అనుచరులు భారీ గజమాల వేసి సన్మానించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో జరిగిన ఘటనలో మంత్రి శ్రీనివాస్ యాదవ్ క్షమాపణ చెప్పటం జరిగిందని అన్నారు. నా పై జరిగిన ఘటనను ఖండించి నాకు మద్దతు తెలిపిన గిరిజనులు, తెలంగాణ ఉద్యమ నాయకులు, ప్రజాప్రతినిధులు, శ్రేయోభిలాషులు సహకారం మరువలేనిదని అన్నారు. ప్రజల కష్ట, సుఖాల్లో పాలు పంచుకుంటానాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాఫ్ట్ రమేష్, సర్పంచులు దూమ నాయక్, సత్యగౌడ్, అనుచరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపన వేడుకలకు తరలిరావాలి
నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఆదిత్య నగర్ కాలనీలో శ్రీ సంకట మోచన హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన వేడుకలకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే జోగు రామన్న సూచించారు. సెప్టెంబర్ 2, 3, 4 తేదీల్లో విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు జరగనున్న నేపథ్యంలో కార్యక్రమ కరపత్రాలను ఆలయ కమిటీ సభ్యులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్‌తో పాటు కమిటి సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగురామన్న మాట్లాడుతూ ఆదిత్య నగర్ కాలనీలో నిర్మించిన శ్రీ సంకట మోచన హనుమాన్ మందిరంలో విగ్రహ ప్రతిష్టాపన వేడుకలను ఘనంగా జరిపేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని అన్నారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వేడుకలను నిర్వహించనున్నారని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలనీ పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ ఇజ్జగిరి నారాయణ, ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, కౌన్సిలర్ పవన్ నాయక్, దశరథ్, దత్తు, పుండలిక్, వంశీ పాల్గొన్నారు.

31న సాముహిక యజ్ఞోపవీత ధారణ
నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఓల్డ్ కాలనీలోగల శ్రీ ఉమా మహేశ్వర మార్కండేయ ఆలయంలో ఈ నెల 31న ఉదయం 8గంటలకు పద్మశాలి కుల బాంధవుల సాముహిక యజ్ఞోపవీత ధారణ మహోత్సవం, సామూహిక రక్షబంధన మహోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్టు పట్టణ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు దాసరి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కొంగ సంపత్ కుమార్, ఆలయ అర్చకులు పరికిపండ్ల కరుణాకర్ తెలిపారు. సోమవారం ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. పద్మశాలి బంధుమిత్రులు కుటుంబ సమేతంగా హారతిపళ్లేం, ఆచమన పాత్ర పూజాసామాగ్రి తీసుకుని రావాలని సూచించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలి

- జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ

నవతెలంగాణ ఆసిఫాబాద్

సమగ్ర శిక్ష విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష విధానంలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న వివిధ విభాగాల ఉద్యోగులు పెద్ద ఎత్తున జిల్లా విద్యాధికారి కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ విగ్రహనికి పూలమాలవేసి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపిన అనంతరం డిఆర్ఓ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు విద్యాశాఖలో 20 సంవత్సరాల నుండి పని చేస్తున్నారన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం తమ సేవలు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోస్టర్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపికైనప్పటికీ నేటి వరకు ఉద్యోగ భద్రత ఇవ్వకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. వెంటనే స్పందించి సమగ్ర శిక్షలో పనిచేస్తున్న వారికి వెంటనే ఉద్యోగ భద్రత కల్పిస్తూ, మినిమం టైం స్కేల్ ఇవ్వాలని, ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరాధ్యక్షుడు కొప్పుల మోహన్, ప్రధాన కార్యదర్శి తుకారాం, జిల్లా నాయకులు గేడేకార్ సంతోష్ కుమార్, పవన్, సందీప్, రాజేష్, రమేష్, మహేష్, సంతోష్, అన్ని మండలాల సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.


ఆదిలాబాద్‌టౌన్


ఆసిఫాబాద్

ఆదిలాబాద్‌టౌన్ : సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. సోమవారం ఆర్అండ్‌బీ అతిథిగృహం నుండి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీగా తరలివెళ్లి మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళ్లర్పించారు. న్యాయబద్ధమైన తమ డిమాండ్ల సాధన కోసం కలెక్టరేట్ వద్దకు చేరుకుని ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఓ వైపు ప్రభుత్వం వివిధ శాఖల్లోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తుంటే విద్యార్హతలు, అనుభవం ఉన్న సమగ్ర శిక్షలోని ఉద్యోగుల పట్ల వివక్ష చూపడం ఆవేదన కలిగిస్తోందని పేర్కొన్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ, మెరిట్ ప్రాతిపదికన రూల్ ఆఫ్ రిజర్వేషన్ రోస్టర్ పద్ధతిని పాటిస్తూ ఎంపికైన వారే సమగ్ర శిక్ష ఉద్యోగులుగా పని చేస్తున్నారన్నారు. తమ న్యాయ సమ్మతమైన డిమాండ్లను నెరవేర్చేవరకూ తమ పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు.

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలి

నవతెలంగాణ-కెరమెరి

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని నోడల్ ఆఫీసర్ ఆడే ప్రకాష్ అన్నారు. సోమవారం మండలంలోని ఎంపీపీఎస్ ఖైరి, అగర్‌వాడ కేలి-బి పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. బయో మెట్రిక్ హాజరును తప్పనిసరిగా సమయం ప్రకారం నమోదు చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెట్టాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. శిక్షణలో తెలుసుకున్న మెళకువలను ఉపాధ్యాయులు తరగతి గదుల్లో అమలు చేయాలని కోరారు. ఖైరి పాఠశాలలోని విద్యార్థులకు అగ్గిపుల్లలని ఆధారం చేసుకుని వివిధ రకాల ఆకృతులను గురించి బోధిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. పిల్లలలో జ్ఞాన సంపత్తి పెరిగేలాగా వినూత్నంగా విద్యా బోధన అందించాలన్నారు. పిల్లల భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని, వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉన్నదని గుర్తు చేశారు. బోధనలో ఎప్పటికప్పుడు వస్తున్న నూతన ఒరవడులను అందిపుచ్చుకుని ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కోరారు.



నూతన పైప్‌లైన్ ట్రయల్ రన్ చేసిన జీఎం



నవతెలంగాణ-నస్పూర్

ఇంటెక్ వెల్ నుండి రాపిడ్ గ్రావిటీ ఫిల్టర్స్ వరకు నూతన పైపులై ట్రయల్ రన్ సోమవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి, జనరల్ మేనేజర్ సివిల్ సూర్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోదావరి ఇంటెక్ వెల్‌లో రూ.20లక్షల వ్యయం గల 5వ నూతన 190 హెచ్‌పీ పంపును ప్రారంభించామన్నారు. సింగరేణి యాజమాన్యం శుద్ధమైన మంచినీటిని నిరంతరం అందించడానికి 5వ పంపును సిద్ధం చేసుకున్నామన్నారు. 6.6 కిలోమీటర్ల నూతన పైపు లైన్‌లో ఈ రోజు 2కిలోమీటర్ల నూతన పైప్‌లైన్ ట్రయల్ రన్ చేయడం సంతోషకరమన్నారు. సెప్టెంబర్ చివరి వరకు 6.6 కిలోమీటర్ల పైప్ లైన్ ద్వారా నీటిని సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ ఏజీఎం సివిల్ నవీన్, డీజీఎం సివిల్ శివ రావు, ఆనంద్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సివిల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడే మిగిలిన మద్యం దుకాణాలకు లక్కీడ్రా

ఆసిఫాబాద్ : ఈ నెల 21వ తేదీన జిల్లాలోని 32 మద్యం దుకాణాలకు లక్కీ డ్రా నిర్వహించగా 5 దుకాణాలు వాయిదా పడ్డాయి. వాటికి మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ అధికారి నరసింహారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు లక్కీ డ్రా నిర్వహించడం జరుగుతుందని దరఖాస్తు చేసుకున్నవారు సరైన సమయంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ఆదిలాబాద్‌టౌన్ : ప్రజావాణిలో వచ్చే అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొని, అర్జీలను స్వీకరించారు. భూసంబంధ, ఆసరా ఫించన్, ఉపాధి కల్పన, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, విద్యా సంస్థల్లో ప్రవేశాలు వంటి సమస్యలపై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీదారులు ఒకే సమస్యపై మళ్లీ మళ్లీ రాకుండా స్పష్టమైన సమాచారం అందించాలని, ప్రభుత్వ నిబంధనల మేరకు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనీ అన్నారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, శ్యామలదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, ఆర్డీఓ స్రవంతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రతి బుధవారం టీషర్ట్ ధరించాలి..

అనంతరం స్వీప్ కార్యక్రమాలలో భాగంగా ఐ ఓట్ ఫర్ ష్యూర్, అనే అంశంపై జిల్లా కలెక్టర్, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఐ ఓట్ ఫర్ ష్యూర్ అని ప్రచురించబడిన టి-షర్ట్‌లను జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలకు పంపిణీ చేశారు. ప్రతి బుధవారం టి-షర్ట్‌లను ధరించాలని, కార్యాలయాలకు వచ్చే సిబ్బందికి ఓటరు నమోదు, ఓటు వినియోగంపై అవగాహన కల్పించాలని వివరించారు.

అప్రమత్తతతో మోసాలకు దూరం
నవతెలంగాణ-జన్నారం

అప్రమత్తతతోనే సైబర్ మోసాలకు దూరంగా ఉండవచ్చని లక్షెట్టిపేట సీఐ కృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ రూల్స్, ఉమెన్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. చదువుతో ప్రతి విద్యార్థి భవిష్యత్తు బంగారు బాట అవుతుందని, చదువుపై పూర్తిగా దృష్టిపెట్టాలని సూచించారు. అనవసర మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. అనంతరం విద్యార్థినులు పోలీసులకు రాఖీ కట్టారు. కార్యక్రమంలో ఎస్సై సర్కార్, అధ్యాపకులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు శాతం పెంచాలి
నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఓటరు నమోదు శాతాన్ని పెంచాలని మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది, బూత్‌లెవల్ అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో తహసీల్దార్ రహీమొద్దీన్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపీపీ విమలాబాయి, తహసీల్దార్ రహీమొద్దీన్ మాట్లాడుతూ గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు నమోదు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులు అవగాహన కల్పించి ఓటరు నమోదు శాతం పెంచాలని వారికి సూచించారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు కలిగి ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత సర్పంచ్‌లు, కార్యదర్శులపై ఉందన్నారు.

పశువుల రోడ్లపై వదిలితే చర్యలు
నవతెలంగాణ - సిర్పూర్(టి)

ప్రతిరోజు పగలు, రాత్రి సమయంలో ప్రధాన రహదారిపై, ఇతర వాడల్లో సంచరిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని సంబందిత పశువుల యజమానులపై చర్యలు తప్పవని ఎస్సై దీకొండ రమేష్ అన్నారు. పశువుల యజమానులు తమ ఇండ్లలో కట్టివేసుకోవాలని, లేనిపక్షంలో బంజరుదొడ్డిలో వేయించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చిరించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని పెంట్రోల్‌బంక్, ఎస్టీ కాలనీ, ప్రధాన రహదారి మీదుగా గొల్లవాడ, బస్టాండు రోడ్డు, డౌనల్ ఏరియా, గోవింద్‌పూర్ ప్రధాన రోడ్లపై పశువులు రాత్రి, పగలు సంచరిస్తున్నాయన్నారు. ఇకముందు రోడ్లపై పశువులు వదిలేస్తే యజమానులపై కేసులు నమోదుచేస్తామన్నారు.

బీజేపీ పలువురి చేరిక
నవతెలంగాణ-నిర్మల్

సోన్ మండల కేంద్రం, మామడ మండలం కిషన్‌రావ్‌పేట్, దిలావర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు దాదాపు 120మందికి పైగా యువకులు సోమవారం బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరీష్‌రెడ్డి, సరికెల గంగన్న, మార గంగారెడ్డి, భూపతిరెడ్డి, వీరేశ్, శైలేశ్వర్, బాపురెడ్డి, నరేష్, హైమద్, మశ్కన్న, నర్సయ్య, అశోక్, బాలకృష్ణ, మామిడాల సంతు, అమృత్, పోశెట్టి, కంతి రవి, రాజేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

132 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, సామాజిక ఉద్యమకారుడు మందపల్లి భూమాచారి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరావధిక దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో విద్యుత్ కోతలు ఎక్కువ అయ్యాయన్నారు. విద్యుత్ కోతలతో తీవ్రంగా నష్టపోతున్నాం అన్నారు. అప్రకటిత విద్యుత్ కోతలతో తీవ్రంగా నష్టపోతున్నామని చిన్న వ్యాపారులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. మండల కేంద్రంలో చాలామంది యువకులు ఆన్‌లైన్, జిరాక్స్, వెల్డింగ్, తదితర వ్యాపారాలు పెట్టుకొని ఉపాధిని పొందుతున్నారని అన్నారు. విద్యుత్ కోతలు ఎక్కువగా ఉన్నాయని, కరెంట్ పైనే ఆధారపడి తాము ఉపాధిని పొందుతున్నామని విద్యుత్ వినియోగదారులు వాపోతున్నారన్నారు. కోతలు లేకుండా, నాణ్యమైన విద్యుత్ అందించాలంటే మండల కేంద్రంలో తప్పనిసరిగా 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించేంతవరకు సబ్ స్టేషన్ ఏర్పాటు చేసేంతవరకు ఈ నిరావధిక దీక్ష కొనసాగుతుందన్నారు. అన్ని పార్టీల నాయకులు కుల సంఘాల నాయకులు వ్యాపారులు ఈ నిరవధిక దీక్షకు మద్దతు తెలపాలన్నారు. ఈ దీక్షలో టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి రాజేశ్వర్, సీపీఐ నాయకులు మామిడి విజయ్ మురళి పాల్గొన్నారు.

మహిళల మాన ప్రాణాలకు పోలీసుల రక్ష
నవతెలంగాణ-తాండూర్

మహిళలకు రక్షణ కల్పించేందుకు పోలీసు వ్యవస్థ అహర్నిశలు కృషి చేస్తుందని బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్సై రమేష్ తెలిపారు. సోమవారం మహిళల రక్షణ పోలీసు బాధ్యత కార్యక్రమంలో భాగంగా కాంట్రాక్టర్ బస్తీలో బ్రాంచి స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ క్రైమ్, ట్రాఫిక్ రూల్స్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, షీ టీమ్స్, మహిళ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని మహిళలు, బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు.. విద్యార్థులు కష్టపడి చదివి నైపుణ్యత సంపాదించుకుని మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. మహిళలు సమాజం, చట్టాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండడం వల్ల ఆత్మస్థైర్యం పెంపొందుతుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు కాల్ చేసినట్లయితే పోలీసులు రక్షణ కల్పిస్తారని తెలిపారు. విద్యార్థినులతో రాఖీలు కట్టించుకొని రక్షణగా ఉంటామని భరోసా కల్పించారు.

బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలి



నవతెలంగాణ-మందమర్రి

బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని టీడీపీ చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన బస్టాండ్‌ను సందర్శించి మాట్లాడారు. 30 సంవత్సరాల క్రితం తెలుగుదేశం హయాంలో కట్టించిన బస్టాండ్ పశువులకు ఆవాసంగా, మందుబాబులకు అడ్డాగా మారిందన్నారు. బాల్క సుమన్ గెలిస్తే అభివృద్ధి జరుగుతుందని, బస్సులు వస్తాయని చెప్పిన బీఆర్ఎస్ నాయకులకు మందమర్రి బస్టాండ్ పరిస్థితి కనబడడం లేదా? అని ప్రశ్నించారు. బస్టాండ్‌ను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని, లేనియెడల ఎమ్మెల్యే ఇంటి ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జక్కుల సమ్మయ్య, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఎండి షరీఫా, జిల్లా నాయకుడు వాసలా సంపత్, పట్టణ ఇన్చార్జి ముల్కల లక్ష్మీరాజం, పట్టణ మహిళా అధ్యక్షురాలు అనంతలక్ష్మి, పట్టణ ఇన్‌చార్జి ఆర్. జయ, మండల అధ్యక్షుడు మందాటి రాజిరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం
నవతెలంగాణ-జన్నారం

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఉట్నూర్ జెడ్పీటీసీ, పిసిసి సభ్యురాలు, రాష్ట్ర క్యాంపెయిన్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ చారులత రాథోడ్ అన్నారు. సోమవారం జన్నారం గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ అజారుద్దీన్ తండ్రి రిటైడ్ ఫారెస్ట్ ఉద్యోగి మహమ్మద్ రుక్మొద్దీన్ మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ అన్ని విధాల ఆదుకుంటుందన్నారు. అధైర్య పడవద్దని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ సిడాం కౌసల్య బాయి, పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ, నాయకులు బాన్సిలాల్, సాయి పాల్గొన్నారు.

ఎన్కాస్‌కు తాంసి పీహెచ్‌సీ ఎంపిక
నవతెలంగాణ-తాంసి

పీహెచ్‌సీ ఎన్కాస్(నేషన్ ఇక్వాలిటీ ఎస్యురెన్స్ స్టాండర్డ్స్) జాతీయ నాణ్యత హామీ ప్రమాణా పథకం కింద ఎంపికైంది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోగా ఈ నెల 16, 17న ఢిల్లీ నుంచి బృందం వచ్చి పరిశీలించింది. పీహెచ్‌సీలో సౌకర్యాలు, సిబ్బంది మెరుగ్గా ఉండడంతో ఎంపికైనట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ తెలిపారు. పీహెచ్‌సీకి 90.64 శాతం మార్కులు వచ్చినట్టు తెలిపారు. ఎన్కాస్‌కు ఎంపిక పట్ల వైద్యాధికారి డాక్టర్ శ్రావ్య సిబ్బందికి డీఎంఅండ్‌హెచ్ఓ అభినందనలు తెలిపారు.

అతిథి గృహాన్ని కార్పొరేషన్ టూరిజం శాఖకు అప్పగించొద్దు
నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలో ఉన్న నీటి పారుదల శాఖకు సంబంధించిన అతిథి గృహాన్ని కార్పొరేషన్ టూరిజం శాఖకు అప్పగించొద్దని కడెం, సదర్‌మాట్ రైతు అధ్యక్షులు రాజేందర్ హపావత్ ఆధ్వర్యంలో ఈఈ విఠల్‌కు రైతులు, గ్రామపెద్దలతో కలిసి వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఎన్నో సంవత్సరాలుగా కడెం ఆయకట్టు జన్నారం, దస్తురాబాద్, లక్షెటిపేట్, మంచిర్యాల, ఖానాపూర్ ఎగువ ప్రాంత రైతులకు ఉపయోగపడ్డ గెస్ట్ హౌస్‌ను, ప్రభుత్వం కార్పొరేషన్ టూరిజం శాఖకు అప్పగించి, ఈ ప్రాంత రైతులకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు. ఈ నిర్ణయంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన రైతులకు, అధికారులకు తిప్పలు తప్పవన్నారు. ప్రస్తుతం, శిథిలావస్థలో ఉన్న ఆ భవనాన్ని పున్ణనిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా, ఏకపక్షంగా టూరిజం శాఖకు అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.